కాపులను బాబుకు అమ్మేయాలని చూస్తున్న పవన్

రాజమహేంద్రవరం రూరల్: కాపులను కట్టకట్టి చంద్రబాబుకు అమ్మేయాలని చూస్తున్న పవన్‌కళ్యాణ్ కావాలా? మనకు అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కావాలా? అన్నది కాపు సోదరులంతా విజ్ఞతతో ఆలోచించాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు(అను) ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.
















మార్కెట్‌కు న్యూ ఇయర్ జోష్

ప్రకాశం నగర్ : 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికి, 2024 కొత్త ఏడాదికి ఘన స్వాగతం పలికేందుకు నగరవాసులు సమాయత్తమయ్యారు. దీంతో ఆదివారం సాయంత్రం నుంచి నగరంలో ఎటు చూసినా న్యూ ఇయర్ సందడి నెలకొని ఉంది. న్యూ ఇయర్ వేడుకలను ఉత్సాహంగా జరుపుకునేందుకు అవసరమైన స్వీట్లు ,కేక్‌లు కొనుగోలు చేసేందుకు నగరవాసులు ఆసక్తి చూపడంతో నగరంలోని బేకరీలు, స్వీట్ స్టాల్స్, ఫ్లవర్ బోకే షాపులు జనంతో కిటకిటలాడాయి. బేకరీ యజమానులు రకరకాల కేక్‌లను తయారు చేసి విక్రయాలకు సిద్ధం చేశారు. వీటితోపాటు ఆయా ప్రధాన రాజకీయ పార్టీల జెండా రంగుల్లో ఉండే కేక్‌లను కూడా తయారు చేసి విక్రయాలకు సిద్ధంగా ఉంచారు.



న్యూ ఇయర్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి

ప్రత్యేక ఆఫర్లు

నగరంలోని ప్రధాన హోటళ్లు విద్యుత్ కాంతులు విరజిమ్మాయి. డీజే సౌండ్ సిస్టంలు వంటి ఏర్పాటు చేశారు. హోటల్స్‌లో డిన్నర్‌కి సింగిల్స్‌కి ఒక్క రేటు, కపుల్స్‌కి ఒక్క రేటు అంటూ వినియోగదారులకు ఆఫర్లు ప్రకటించారు. రెస్టారెంట్‌లు, బిర్యానీ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు కూడా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి. చికెన్, మటన్, బిర్యానీ ఒకటి కొంటే ఒకటి ఫ్రీ, బిర్యానీ ప్యాకెట్‌కు డ్రింక్ బాటిల్ ఫ్రీ వంటి ఆఫర్లను ప్రకటించడంతో యువత ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు క్యూ కట్టారు.

రంగుల హరివిల్లు

ప్రతి ఇంటి ముందు రంగులతో నూతన సంవత్సర శుభాకాంక్షలు అనే ముగ్గులు వేసి మురిసిపోయే మహిళలు వివిధ రకాల రంగులను కొనుగోలు చేశారు. తమ ఇంటి ముందు వేసే ముగ్గు పెద్దదిగా ఉండాలని ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

ఎంపీ సార్.. నాకు పునర్జన్మ ఇచ్చారు

జీవితాంతం రుణపడి ఉంటా

రాజమహేంద్రవరం రూరల్: నగరంలోని 25వ డివిజన్ మంగళవారపు పేట, ఆకుల వారి వీధికి చెందిన టీడీపీ కార్యకర్త పూతి సంతోషిమాత గుండె సంబంధిత సమస్యతో తీవ్ర అనారోగ్యానికి గురైంది. రాజమహేంద్రవరంలో వైద్యులు ఈమె ఆరోగ్యాన్ని పరీక్షించి ఆపరేషన్ చేయాలంటే రూ.6 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. సంతోషి మాత భర్త అప్పలరెడ్డి ఆటో డ్రైవర్. రోజు గడపడమే భారంగా ఉన్న తాము ఇన్ని లక్షలు ఎక్కడ్నించి తేవాలి? అని సతమవుతున్న సమయంలో తనకు తెలుసున్న మార్గాని సుశీలను కలిసి తన ఆవేదన వ్యక్తం చేసింది. సుశీల ఎంపీ భరత్‌ను కలిసి..తన మిత్రురాలి ఆరోగ్య పరిస్థితి వివరించి సహాయాన్ని కోరింది. ఎంపీ భరత్ స్పందించారు. సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4.5 లక్షలు మంజూరయ్యాయి. ఎంపీ భరత్ హైదరాబాదులో వైద్యులతో మాట్లాడి, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆమెకు గుండెకు ఆపరేషన్ చేయించారు. ఆమె కోలుకుంది. నగరంలోని వీఎల్ పురంలో గల ఎంపీ కార్యాలయానికి మార్గాని సుశీల సహాయంతో వచ్చింది. ఆమెను ఎంపీ భరత్ ఆప్యాయంగా పలకరించారు. ఈ సమయంలో ఆమెకు కన్నీళ్ళు ఉబికి వచ్చాయి. మీరు ఆదుకోకుంటే నేను బతికి ఉండేదానిని కాను..నాకు పునర్జన్మ ఇచ్చారు..మీకు ఎంతో రుణపడి ఉన్నానంటూ ఉద్వేగంతో చెప్పింది. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్నకు, ఎంపీ భరత్ అన్నకు రుణపడి ఉంటానంటూ కృతజ్ఞతలు తెలిపింది.



ఎంపీ భరత్‌రామ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సంతోషిమాత

సామాన్యులకు అందుబాటులో స్పీడ్ రైళ్లు

కేంద్ర ప్రభుత్వం సామాన్యులకు సైతం వేగవంతమైన రైళ్లను అందుబాటులో తీసుకు రావడం అభినందించదగ్గ విషయమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆదివారం రాత్రి విశాఖపట్నం మీదుగా విజయవాడ వెళుతున్న అమృత్ భారత్ రైలుకు రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్లో ఎంపీ భరత్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున విద్యార్థులు, నగర వాసులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైల్వే అధికారులు స్వాగతం పలికారు. ఈ రైలును డిసెంబర్ 30న మాల్దా టౌన్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. అమృత్ భారత్ రైలు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో ఆగగానే జై భారత్, జై శ్రీరామ్ నినాదాలతో రైల్వేస్టేషన్ మార్మోగిపోయింది. అమృత్ భారత్ ట్రైన్‌లో 12 స్లీపర్ క్లాస్, 8 జనరల్, రెండు గార్డు బోగీలు ఉంటాయని తెలిపారు. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందన్నారు. పలు రైల్వే స్టేషన్లో ఈ రైలు ఆగడం వల్ల అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటుందనే ఆశాభావాన్ని ఎంపీ భరత్ వ్యక్తం చేశారు.

రైల్వే స్టేషను అభివృద్ధికి రూ.300 కోట్లు

రాజమహేంద్రవరం రైల్వే స్టేషను అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.300 కోట్లు మంజూరు చేసిందని ఎంపీ భరత్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న రైల్వే స్టేషను సమీపంలోని అయిదు బళ్ళ మార్కెట్ వద్దకు తరలిపోనుందని చెప్పారు. విశాఖ- విజయవాడ మధ్య 3, 4 లైన్లు పెరుగుతున్న సందర్భంగా రాజమండ్రి, కోస్తా ప్రాంతాలకు మహర్దశ కలగబోతోందని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని హైస్పీడ్ రైళ్లు రానున్న కారణంగా అందుకు తగ్గట్టు రాజమహేంద్రవరంలో గోదావరి నదిపై మరో కొత్త వంతెన అవసరం చాలా ఉందన్నారు. ఈ విషయాన్ని పార్లమెంటులోను, రైల్వే శాఖ మంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి వివరించినట్టు తెలిపారు. త్వరలోనే ఆ కొత్త వంతెనకు కూడా శంకుస్థాపన చేసే అవకాశం ఉందన్నారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రైల్వేస్టేషన్ ఎస్ఎం రంగనాథ్, ఆర్పీఎఫ్ సీఐ టి.సైదయ్య, సీటీఐ చంద్రమౌళి, రైల్వే అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు, స్కౌట్‌గైడ్స్ పాల్గొన్నారు.



అమృత్‌భారత్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాలలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఆదివారం హుకుంపేట (నేషనల్ హైవే) నుంచి బాలాజీపేట వెళ్లే ఈస్టన్ రైల్వే రహదారి 1.25 కిలోమీటర్ల మేర రూ.కోటితో అభివృద్ధి చేసే పనులకు ఎంపీ భరత్, ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ ఈ పనులను పది రోజుల్లో పూర్తి చేస్తారన్నారు. బాలాజీపేట నుంచి మోరంపూడి ఎఫ్‌సీబీ రోడ్డు అభివృద్ధి చేస్తామన్నారు. హుకుంపేట కల్వర్టు నిర్మాణానికి రూ.70 లక్షలు మంజూరు అయ్యాయని, త్వరలోనే ఆ పనులు పారంభిస్తామని ఎంపీ భరత్ తెలిపారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే సీఎం జగన్ అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ డీఈఈ నిక్కీ క్రజ్, ఏఈ కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు, హుకుంపేట సొసైటీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, పార్టీ మండల కార్యదర్శి కుప్పాల రాంబాబు, సచివాలయ కన్వీనర్లు పసలపూడి శ్రీనివాసరావు, చిర్రా గణేష్, వీర్లనాగు, పెయ్యలరాజేష్, పదాల వీరరాఘవరెడ్డి, పుచ్చల గోవిందరెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక మంగళవారపుపేటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బోగిరెడ్డి శ్రీనివాస్‌ను ఆదివారం అరెస్టు చేశామని ఎస్ఈబీ నార్త్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతని వద్ద నుంచి 650ఎంఎల్ ఆరు బీరు బాటిల్స్, 180ఎంఎల్ ఐదు మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



క్రీడల్లో రాణించాలి

ప్రకాశం నగర్ : యువత క్రీడల్లో రాణించి, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిడ్జామ్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్ 2023–24ను ఎంపీ భరత్ ప్రారంభించారు. తొలుత జ్యోతి వెలిగించి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. గాలిలోకి బెలూన్లు వదిలారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి క్రీడలంటే ఎక్కువ ఆసక్తి అని, క్రీడలలో రాణిస్తున్న విద్యార్థులను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. నిర్వాహకులు రాజేంద్ర, శివకుమార్, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు .

వైఎస్సార్ సీపీలో 50 మంది చేరిక

ధవళేశ్వరం: హనీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 50మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్, రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక ఎర్రకొండ వడ్డెర వీధిలో జరిగిన కార్యక్రమంలో వీరు పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి వైఎస్సార్ సీపీకి ఆకర్షితులయ్యామని హనీ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అన్న, వస్త్రదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హనీ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు చందన నాగేశ్వర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తాటికొండ విష్ణుమూర్తి, కొప్పినీడి ప్రసాద్‌బాబు(రాజమౌళి), ఎల్వీ ప్రసాదరావు, ప్రభు అంబేడ్కర్ (హనీ), రవీంద్ర, అనీల్ సురేష్ ,తలారి ప్రసాద్ పాల్గొన్నారు.



నాగేశ్వర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరిన హనీ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు



● సత్యదేవాలో అయోధ్య రాముడి ఆలయ నమూనా



కడియపులంక కలోని శ్రీ సత్యదేవ నర్సరీలో మొక్కలతో ఏర్పాటు చేసిన అయోధ్యలోని శ్రీరాముడి ఆలయ నమూనా – కడియం



3 నుంచి కార్మికుల సమ్మె

ప్రకాశం నగర్ : మున్సిపల్, కార్పొరేషన్, నగర పంచాయతీల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జనవరి 3 నుంచి సమ్మె ప్రారంభిస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా నాయకులు తాటిపాక మధు చెప్పారు. ఆదివారం తాడితోట వద్ద గల యూనియన్ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎస్.రమణ అధ్యక్షత వహించగా, కుండ్రపు రాంబాబు పాల్గొన్నారు.













